బొంరాస్‌పేట : పూర్యానాయక్‌తండా పాఠశాలలో పనులను పరిశీలిస్తూ అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

పనులు నాణ్యతగా చేపట్టాలి

- వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి
- బొంరాస్‌పేట మండలం పూర్యానాయక్‌తండా, చౌదర్‌పల్లి ఉన్నత పాఠశాలలు, పరిగిలోని జడ్పీ హెచ్‌ఎస్ నం.1, బాలికల ఉన్నత పాఠశాల, సయ్యద్ మల్కాపూర్ ప్రాథమిక పాఠశాల సందర్శన
- అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సౌకర్యాల పనులు

బొంరాస్‌పేట, మే 21 : అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టే పనుల్లో మరుగుదొడ్లు, విద్యుత్తు, తాగునీటికి మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం మండలంలోని పూర్యానాయక్‌తండా, చౌదర్‌పల్లి ఉన్నత పాఠశాలల్లో జరుగుతున్న పనులను కలెక్టర్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కింద వచ్చిన నిధులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. చేపట్టే పనులను నాణ్యతగా పక్కాగా చేయాలని, ఇంట్లో ఏ విధంగా పనులు చేసుకుంటామో పాఠశాలల్లో కూడా పనులు నాణ్యతగా ఉండాలన్నారు. మరుగుదొడ్లు, వాష్ రూంలలో నీరు సాఫీగా వెళ్లేలా పనులు చేయాలన్నారు. వర్షాలు కురిసే సమయాల్లో లీకేజీలుండకుండా చర్యలు తీసుకోవాలని.. ఏ చిన్న లీకేజీ ఉన్నా మరమ్మతులు చేయాలని ఆదేశించారు. పాఠశాలల్లో చేపడుతున్న పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రధానోపాధ్యాయులు అత్యవసరమైన పనులను గుర్తించి వాటిని చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. చౌదర్‌పల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యుత్ పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించారు. పూర్యానాయక్‌తండా పాఠశాల ఆవరణలో మొక్క నాటి నీళ్లు పోశారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను తెలుసుకుని తరగతి గదుల్లో వసతి సౌకర్యాలు, మరుగుదొడ్లను పరిశీలించారు. పనులను అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలతో చేయించాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీలు దేశ్యానాయక్, నారాయణరెడ్డి, తహసీల్దార్ పద్మావతి, ఎంపీడీవో శ్రీదేవి, డీటీ రవి, పీఆర్ డీఈ సుదర్శన్‌రావు, ఏఈ సురేందర్‌రెడ్డి, ఎంఈవో రాంరెడ్డి, ఎంపీవో మహేశ్, హెచ్ ఎంలు శ్రీహరిరెడ్డి, రవీందర్‌గౌడ్ ఉన్నారు.

పనులు వేగంగా పూర్తి చేయాలి

పరిగి : అమ్మ ఆదర్శ పాఠశాలల్లో భాగంగా చేపడుతున్న పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. పరిగిలోని జడ్పీహెచ్‌ఎస్ నం.1, బాలికల ఉన్నత పాఠశాల, సయ్యద్ మల్కాపూర్ ప్రాథమిక పాఠశాలల్లో చేపడుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సయ్యద్ మల్కాపూర్ పాఠశాల ప్రహరీని పెంచేందుకు ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. ఈ సందర్భంగా పరిగి పట్టణంలో మెప్మా ఆధ్వర్యంలో విద్యార్థులకు యూనిఫారాలు కుట్టే కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. దుస్తుల తయారీలో నాణ్యత ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఉమేశ్, జిల్లా పంచాయతీ అధికారి జయసుధ, తహసీల్దార్ ఆనంద్‌రావు, మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య, మండల విద్యాధికారి హరిశ్చంద్ర, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు గోపాల్, కృష్ణారెడ్డి, రుక్మిణి పాల్గొన్నారు.

టీ-సేవ కేంద్రాల ఏర్పాటుకు దరఖాస్తులు

కాచిగూడ, మే 21: నిరుద్యోగ యువకులు టీ-సేవ ఆన్‌లైన్ కేంద్రాలను ఏర్పాటు చేసుకోవడానికి తెలంగాణ వ్యాప్తంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులను కోరుతున్నట్లు టీ - సేవ సంస్థ డైరెక్టర్ అడపా వెంకట్‌రెడ్డి తెలిపారు. కాచిగూడలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ టీ-సేవ బ్యాంకు మిత్ర ద్వారా డెబిట్ కార్డ్స్, లైఫ్‌టర్మ్ ఇన్సూరెన్స్ చెల్లింపులు, బస్సు, రైలు, విమానాల టికెట్స్ బుకింగ్, కొత్త పాన్ కార్డులు, టెలికాం పోస్ట్ పెయిడ్, ప్రీ పెయిడ్, ఆల్ బ్యాంక్స్ మనీ ట్రాన్స్‌ఫర్లు, ఆధార్ పేమెంట్ సిస్టం, మైక్రో ఏటీఎం, బ్యాంక్ సేవలు అందించనున్నట్లు మంగళవారం పేర్కొన్నారు. ఇంటర్, డిగ్రీ, డిప్లమా, ఇంజనీరింగ్ యువకులు ఈ నెల 31వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని కోరారు. వివరాలకు ఫోన్ నం. 8179955744, www.tsevacentre.com లో సంప్రదించవచ్చని కోరారు.

నేడు స్మైలింగ్ బుద్ధ స్వర్ణోత్సవం

అడ్డగుట్ట, మే 21: భారతదేశం తొలిసారిగా నిర్వహించిన అణు పరీక్ష (స్మైలింగ్ బుద్ధ) జరిగి యాభై ఏళ్లు పూర్తైన సందర్భంగా తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్ (టీఏఎస్) ఆధ్వర్యంలో బుధవారం కార్యక్రమం నిర్వహించనున్నట్లు టీఏఎస్ ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ ఎస్.సత్యనారాయణ తెలిపారు. ఐఐసీటీలోని వివేకానంద ఆడిటోరియంలో సాయంత్రం నాలుగు గంటలకు నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అణు పరీక్షల్లో కీలక పాత్ర పోషించిన పద్మ విభూషణ్ డాక్టర్ ఆర్.చిదంబరం పాల్గొంటారని చెప్పారు. 'మే 1974 టస్ట్ అండ్ బియాండ్' అనే అంశంపై ఆయన ప్రసంగిస్తారని వివరించారు. గౌరవ అతిథిగా న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్ చైర్మన్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ డాక్టర్ కోమల్ కపూర్ హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



ధరణి దరఖాస్తుల పరిశీలన, ప్రభుత్వ భూముల రక్షణపై రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

ధరణి దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించాలి

- రంగారెడ్డి కలెక్టర్ శశాంక
- ధరణి దరఖాస్తుల పరిశీలన, ప్రభుత్వ భూముల రక్షణపై రెవెన్యూ అధికారులతో సమావేశం

రంగారెడ్డి, మే 21 (నమస్తే తెలంగాణ) : పెండింగ్ ధరణి దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయాలని, ఎలాంటి పొరపాట్లు జరుగకుండా బాధ్యతగా పని చేయాలని సంబంధిత రెవెన్యూ అధికారులకు రంగారెడ్డి కలెక్టర్ శశాంక సూచించారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో కలెక్టర్ ధరణి దరఖాస్తుల పరిశీలన, ప్రభుత్వ భూముల రక్షణపై రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ధరణి పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను ఏ విధంగా పరిష్కరించాలి? అనే విషయంపై ఆర్డీవోలు, తహసీల్దార్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గడువు లోపల పెండింగ్ ఉన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించాలని, అవసరమైతే ఫీల్డ్ ఇన్స్పెక్షన్ చేసి ఆన్‌లైన్‌లోనే కాకుండా మాన్యువల్‌గా కూడా ఉండేలా చూడాలని తహసీల్దార్లను ఆదేశించారు. రిపోర్టులను పరిశీలించి సంబంధిత నివేదికలతో పూర్తిస్థాయిలో కలెక్టరేట్‌కు సమర్పించాలని సూచించారు. మే 31 వరకు పెండింగ్ సమస్యలు పరిష్కరించేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి మండలంలోని గ్రామాల వారీగా ప్రభుత్వ భూముల వివరాలు ప్రతి తహసీల్దార్ వద్ద ఉండాలని, ధరణి దరఖాస్తులను అందుబాటులో ఉన్న రికార్డుల ద్వారా పరిశీలించి పూర్తి చేయాలన్నారు. మాడ్యూల్స్ వారీగా ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, ప్రతి దరఖాస్తును పరిష్కరించేలా చర్యలు చేపట్టాల్సి ఉంటుందని తెలిపారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి, ఆర్డీవోలు, తహసీల్దార్లు, సంబంధిత అధికారులున్నారు.

ప్రభుత్వ దవాఖాన నూతన భవన నిర్మాణ పనులు త్వరలో ప్రారంభం

రంగారెడ్డి జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్లు

ఆమనగల్లు, మే 21 : ఆమనగల్లులోని ప్రభుత్వ దవాఖాన ఆవరణలో 50 పడకలతో కూడిన నూతన భవనానికి అతి త్వరలో నిర్మాణ పనులు చేపడుతామని రంగారెడ్డి జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మంగళవారం ఆయన ప్రభుత్వ దవాఖానను ఆకస్మికంగా తనిఖీ చేశారు. గతంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వంలో రూ.17.50 కోట్లతో 50 పడకలతో కూడిన భవన నిర్మాణానికి సంబంధించి మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ శంకుస్థాపన చేశారు. నూతన భవన నిర్మాణ పక్రియలో భాగంగా వైద్య సేవలను ఆస్పత్రి ఆవరణలోని క్లస్టర్ కార్యాలయంలోకి మార్చేందుకు వైద్యాధికారి పరీక్షిత్ నరేందర్‌తో కలిసి జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్లు పరిశీలించారు. క్లస్టర్ కార్యాలయంలో యథావిధిగా ఓపీ సేవలు అందించాలని వైద్యులకు ఆయన సూచించారు. కార్యక్రమంలో ఏవో శ్రీనివాసులు, వైద్యాధికారి, హోమియోపతి వైద్యురాలు అర్చన, సిబ్బంది సునీత, కృష్ణలీల, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బందితో కలిసి దవాఖానను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి

కొనుగోలు విషయంలో నిర్లక్ష్యం తగదు

దండుమైలారం, రాయపోల్‌లో పర్యటించిన అడిషనల్ కలెక్టర్ భూపాల్‌రెడ్డి

దండుమైలారం ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద రైతులతో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్

ఇబ్రహీంపట్నంరూరల్, మే 21 : రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన వరిధాన్యం కొనుగోలు విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహించరాదని రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ భూపాల్‌రెడ్డి అన్నారు. దండుమైలారం, రాయపోల్ గ్రామాల్లో కొనసాగుతున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతులతో నేరుగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఎప్పటికప్పుడు ధాన్యం కొనుగోలు చేయడంతోపాటు తమకు సరిపడా టార్పాలిన్ కవర్లు, వరిధాన్యం ఎండబెట్టేందుకు ఫ్యాన్లు అదనంగా అందించాలని, వర్షంలో తడిసిపోయిన ధాన్యం కూడా కొనుగోలు చేయాలని రైతులు కోరారు. దీనిపై వెంటనే స్పందించిన భూపాల్‌రెడ్డి ఆయా సంబంధిత శాఖల అధికారులకు తగు సూచనలు చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించకుండా ఎప్పటికప్పుడు ధాన్యం కొనుగోలు చేస్తూ వారికి అవసరమైన అన్ని రకాల సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. ఎక్కడైనా నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ విజయలక్ష్మి, జిల్లా సహకార సంఘం అధికారి ధాత్రీదేవి, డీఎస్‌వో రాథోడ్, మండల వ్యవసాయాధికారి వర(ప్రసాద్‌రెడ్డి, ఏఈవోలు శ్రవణ్‌కుమార్, రఘు పాల్గొన్నారు.

ప్రజల సంరక్షణ కోసమే కార్డన్ సెర్చ్

వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి

ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

వికారాబాద్, మే 21 : ప్రజల సంరక్షణ కోసమే కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నామని వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు మంగళవారం సాయంత్రం వికారాబాద్‌లోని రాజీవ్ గృహకల్ప కాలనీలో పోలీసు అధికారులు, సిబ్బందితో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఇందులో గృహకల్పలోని అనుమానాస్పద వ్యక్తులు, పరిసరాలు, సరైన పత్రాలు లేని వాహనాలను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో 43 ద్విచక్ర వాహనాలు, 3 ఆటోలు, 4 నాలుగు చక్రాల వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. కార్డన్ సెర్చ్‌తో ప్రజలెవ్వరు కూడా ఎలాంటి భయభ్రాంతులకు గురికావద్దన్నారు. చుట్టుపక్కల ఉన్న పరిసరాలు, నివసించే మనుషుల గురించి ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలని సూచించారు. ఏదైనా అనుమానం కలిగితే వెంటనే పోలీస్ అధికారులకు తెలియజేయాలన్నారు. సీజ్ చేసిన వాహనాల యజమానులు వికారాబాద్ పోలీస్ స్టేషన్‌లో వాహనాలకు సంబంధించిన సరైన పత్రాలను చూపించి తీసుకొని వెళ్లవచ్చని డీఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో వికారాబాద్, మోమిన్‌పేట, ధారూరు సీఐలు నాగరాజు, ఆంజనేయులు, రామకృష్ణ, వికారాబాద్ సబ్ డివిజన్ పరిధిలోని 5గురు ఎస్సైలు, సబ్ డివిజన్ అధికారులు, క్యూఆర్‌టీ సిబ్బంది, 77 మంది పోలీస్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

రైతులు రశీదులు తప్పనిసరిగా తీసుకోవాలి

వికారాబాద్ జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్

ఫెర్టిలైజర్ దుకాణాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి గోపాల్

వికారాబాద్, మే 21 : పంటలు సాగు చేసే రైతులు ఫెర్టిలైజర్ దుకాణాల్లో కొనుగోలు చేసే విత్తనాలకు సంబంధించిన రశీదులు తప్పనిసరిగా తీసుకోవాలని వికారాబాద్ జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్ అన్నారు. మంగళవారం వికారాబాద్‌లోని పలు ఫెర్టిలైజర్ దుకాణాలను సందర్శించిదుకాణ యజమానులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు వ్యవసాయాధికారుల సలహాలు పాటించి పంట దిగుబడి పెంచుకోవాలని తెలిపారు. ఫెర్టిలైజర్ దుకాణాలు రైతులకు నకిలీ విత్తనాలు అమ్మకూడదని, అధిక ధరలకు అమ్మి మోసం చేయకూడదని ఆయన సూచించారు. కార్యక్రమంలో వికారాబాద్ వ్యవసాయాధికారి జ్యోతి ఉన్నారు.

నిధులను సద్వినియోగం చేసుకోవాలి

- వికారాబాద్ డీఈవో రేణుకాదేవి
- పాత కొడంగల్ గ్రామంలోని మండల పాఠశాలల సందర్శన

పాఠశాల ఆవరణలో కొనసాగుతున్న పనులను పరిశీలిస్తున్న డీఈవో రేణుకాదేవి

కొడంగల్, మే 21 : అమ్మ ఆదర్శ పాఠశాలల్లో భాగంగా పనుల నిర్వహణకు మంజూరైన నిధులను సద్వినియోగం చేసుకొని పాఠశాలలో మౌలిక సౌకర్యాలు కల్పించాలని డీఈవో రేణుకాదేవి తెలిపారు. సోమవారం మున్సిపల్ పరిధిలోని పాత కొడంగల్ గ్రామంలోని మండల పాఠశాలలను ఆమె సందర్శించి పనులను పరిశీలించారు. పనులను నాణ్యతగా చేపట్టాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు క్రాంతికుమార్, సీఆర్‌పీ శ్రీనివాస్. మున్సిపల్ సిబ్బంది ప్రవీణ్‌కుమార్ ఉన్నారు.

జిల్లా పరిషత్ స్థాయి సంఘ సమావేశం మంగళవారం ఖైరతాబాద్‌లోని జిల్లా పరిషత్ కార్యాలయంలో జరిగింది. గ్రామీణాభివృద్ధి, విద్య, వైద్యం, పనులు, ప్రణాళిక, ఆర్థిక అంశాలపై జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ తీగల అనితాహరినాథ్‌రెడ్డి, వైస్ చైర్మన్ ఈట గణేశ్, జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, డిప్యూటీ సీఈవో రంగారావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, జడ్పీటీసీలు, కో-ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.
- రంగారెడ్డి, మే 21 (నమస్తే తెలంగాణ)

ఆగిన వంతెన నిర్మాణం

సాగర్‌రహదారిలో శ్రీఇందు కళాశాల సమీపంలో అర్ధాంతరంగా నిలిచిపోయిన వంతెన నిర్మాణ పనులు

- ప్రభుత్వం మారడంతో ముందుకు సాగని పనులు
- గంటల తరబడి నిలిచిపోతున్న వాహనాలు
- ఇబ్బందులు పడుతున్న జనం

ఇబ్రహీంపట్నం, మే 21 : హైదరాబాద్ - నాగార్జునసాగర్ ప్రధాన రహదారిలోని శేరిగూడ సమీపంలో అర్ధాంతరంగా నిలిచిపోయిన వంతెన నిర్మాణానికి మోక్షమెప్పుడోనని ఆ ప్రాంతవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత సంవత్సర కాలంగా రోడ్డుకు ఒకవైపు మాత్రమే వంతెనను నిర్మించి వదిలిపెట్టారు. రెండువైపులా నుంచి వచ్చే వాహనాలను ఒకే వైపునకు దారి మళ్లిస్తున్నారు. దీంతో నిత్యం గంటల తరబడి వాహనాలు నిలిచిపోవడంతో పాటు తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. రెండు సంవత్సరాల కింద ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు నిండి అలుగు పారడంతో ఈ వంతెన సమీపంలోని రోడ్డుపై నుంచి అలుగు పారింది. దీంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. అప్పటి ప్రభుత్వం వంతెన నిర్మాణం కోసం రూ.3 కోట్లను కేటాయించి నిర్మాణాన్ని చేపట్టింది. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం ఓడిపోవడంతో నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ప్రస్తుత ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి వంతెన నిర్మాణానికి నిధులు కేటాయిస్తామని చెప్పినప్పటికీ సంబంధిత అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఇబ్రహీంపట్నం - నాగార్జునసాగర్ ప్రధాన రహదారి నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించాల్సిన అవసరం ఉన్నదని స్థానికులు కోరుతున్నారు.

నిధులు కేటాయించాలి..

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిధులు కేటాయించి ఒక వైపు వంతెన నిర్మాణాన్ని పూర్తిచేసింది. ఎన్నికలు రావడంతో పనులు నిలిచిపోయాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ వంతెన నిర్మాణ విషయంలో నిర్లక్ష్యం చేస్తున్నది. నిత్యం ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నా.. ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోవడంలేదు. వర్షం పడిందంటే చాలు రోడ్డుపై నీరు నిలువడంతో నానా ఇబ్బందులు పడాల్సిందే. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి.
- బూడిద రాంరెడ్డి, మాజీ సర్పంచ్ ఉప్పరిగూడ

ప్రయాణం నరకమే..

నాగార్జునసాగర్ రహదారిపై అర్ధాంతరంగా నిలిచిన వంతెన నిర్మాణ పనులను పూర్తి చేయాలి. మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి గత ప్రభుత్వం నుంచి నిధులు తీసుకొచ్చి వంతెన నిర్మాణ పనులను ప్రారంభించారు. ఎన్నికలొచ్చాక పనులు ముందుకు సాగలే. దీంతో నిత్యం ఇబ్రహీంపట్నం నుంచి నగరానికి వెళ్లాలంటే ప్రయాణికులు నరకం అనుభవిస్తున్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి వంతెన నిర్మాణాన్ని పూర్తి చేయాలి.
- సాయికుమార్

తెలుగు వర్సిటీ వీసీకి ఘనంగా వీడ్కోలు

తెలుగు యూనివర్సిటీ, మే 21: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి 11వ ఉపాధ్యక్షులుగా పనిచేసిన ఆచార్య తంగెడ కిషన్ రావు మూడేండ్ల పదవీ కాలం ముగిసినందున మంగళవారం వర్సిటీ ప్రాంగణంలో గల ఆడిటోరియంలో ఘనంగా వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసి సత్కరించారు. నాంపల్లి ప్రాంగణంలో మూడు దశాబ్దాలుగా కొనసాగుతున్న తెలుగు వర్సిటీని వంద ఎకరాల విస్తీర్ణంలో బాచుపల్లిలో నూతనంగా నిర్మించిన భవన సముదాయాల ప్రాంగణానికి తరలించేందుకు కిషన్ రావు చేసిన కృషిని ఈ సందర్భంగా వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేశ్ కొనియాడారు. విశ్వవిద్యాలయం పీఠాధిపతులు, శాఖాధిపతులు, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొని కిషన్‌రావుతో గల అనుబంధాన్ని నెమరువేసుకుని ఘనంగా సత్కరించారు. తన శక్తివంచన లేకుండా చేసిన కృషికి సహకరించిన వర్సిటీ పరిపాలన, బోధనా సిబ్బందికి, విద్యార్థులకు కిషన్‌రావు కృతజ్ఞతలు తెలిపారు.

తెలుగు వర్సిటీ వీసీగా పనిచేసిన కిషన్‌రావుకు ఘనంగా వీడ్కోలు పలుకుతున్న ఉద్యోగులు

నూతన ఇన్‌చార్జి వీసీగా శైలజా రామయ్యర్

ఇన్‌చార్జి వీసీగా ఐఏఎస్ అధికారి శైలజారామయ్యర్‌ను నియమిస్తూ మంగళవారం ప్రభుత్వం ప్రకటన విడుదల చేసింది. బుధవారం ఆమె బాధ్యతలను స్వీకరించనున్నారు. ప్రతి మూడేండ్లకు విశ్వవిద్యాలయానికి నూతన వీసీని నియమించే ఆనవాయితీ ఉండగా, పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ఇన్‌చార్జి వీసీ నియామకంతోనే ప్రభుత్వ సరిపెట్టింది. జూన్ 16లోగా పూర్తిస్థాయి వీసీని నియమించేలా ఉన్నత విద్యాశాఖ మంగళవారం జీవో జారీ చేసింది. వీసీ కోసం ప్రభుత్వానికి 66 మంది దరఖాస్తు చేసుకోగా, కమిటీ అందులో నుంచి ఒకరిని ఎంపిక చేసి జూన్ 16 వరకు పూర్తి స్థాయి వీసీని నియమించే అవకాశమున్నది. అప్పటివరకు శైలజ కొనసాగనున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేస్తున్నది

బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్

గన్‌పార్కులో నిరసన తెలుపుతున్న బీజేవైఎం కార్యకర్తలను అరెస్టు చేస్తున్న పోలీసులు

తెలుగు యూనివర్సిటీ, మే 21: నిరుద్యోగ యువత పట్ల చిత్తశుద్ధి లేకుండా ఉద్యోగాలు కల్పించలేని సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి సరైన సమయంలో బుద్ధి చెబుతామని బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు సెవెళ్ల మహేందర్ హెచ్చరించారు. రెండు లక్షల ఉద్యోగాల భర్తీ, మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకటన తదితర సమస్యలపై గన్‌పార్కులో గల అమరవీరుల స్థూపం వద్ద మంగళవారం బీజేవైఎం నిరసన చేపట్టింది. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ.. యూత్ డిక్లరేషన్ ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి నేటి వరకు హామీలను నెరవేర్చలేదని ఆరోపించారు. ఎన్నికల హామీని అమలు చేయాలన్నారు. మెగా డీఎస్సీ ద్వారా 50 వేల ఉద్యోగాలు భర్తీ చేయాలని కోరారు. పాఠశాలలు, కళాశాలల, యూనివర్సిటీలలో టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను త్వరితగతిన నిమమించాలన్నారు. రెండేండ్లుగా పెండింగ్‌లో ఉన్న రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అన్ని రకాల వడ్లకు బోనస్ విడుదల చేయాలని ఆయన కోరారు. నిరసనకారులను పోలీసులు అరెస్టు చేసి పలు పోలీస్ స్టేషన్లకు తరలించారు. నిరసన కార్యక్రమంలో బీజేవైఎం ప్రధాన కార్యదర్శులు సామల పవన్‌రెడ్డి, కుండే గణేష్, సురేశ్‌గౌడ్, నామని మహేశ్, కుమార్ యాదవ్, చిత్తరంజన్‌రెడ్డి, తరుణ్‌రెడ్డి, సంతోష్ పాల్గొన్నారు.